

# శాస్త్రి కాలేజీ చదువు

[కథానిక]

= శ్రీ భమిడిపాటి శివరామకృష్ణశర్మ =

"ఉంచడమా, తీసెయ్యడమా?" ఇదే రామశాస్త్రికి పట్టుకున్న గట్టిసమస్య.

రామశాస్త్రి స్వగ్రామం పుల్లేటికుర్రు. అమలాపురం హైస్కూలులో చదివి స్కూలు ఫైనలు పరీక్షలో ఉత్తీర్ణుడయేడు. అట్టే తెలివితేటలు లేకపోయినా, అహోరాత్రాలూ కృషిచేయడంచేత పరీక్షలో మంచి మార్కులే వచ్చేయి. దాంతో శాస్త్రికి ఏకాలేజీలోనో చేరి ఉన్నతవిద్య అభ్యసించాలనే ఉబలాటం ఎక్కువయింది. కుర్రాడి పట్టుదలవల్లనైతేనేమి, ఇరుగుపొరుగు వారి ప్రోత్సాహంవల్లనైతేనేమి శాస్త్రి తల్లిదండ్రులు అతణ్ని ఇంటరుమీడియట్లుక్లాసు చదివించేందుకు ఒప్పుకున్నారు.

శాస్త్రితల్లిదండ్రులు బాగా ఇంత వున్నవాళ్లనే చెప్పాలి. శాస్త్రితండ్రి పంచకావ్యాలూ పూర్తిచేసి వ్యవసాయం చూచుకోడం మొదలెట్టేడు. శాస్త్రి ఇంట్లో వున్నవాళ్లంతా పూర్తిగా పూర్వాచారపరాయణులే. శాస్త్రికిమాత్రం ఆ వాసన లేకుండా ఎక్కడికి పోతుంది? శాస్త్రికి విశాలమైన కాటుకకళ్లు, కండలుతేరిన శరీరం, సామాన్యమైన పొడుగు, కొంచెం కొనతేరిన ముక్కు—అన్నీ బాగానే వున్నాయి. కాని, వెనకాల పిలకొక్కటిమాత్రం వచ్చింది! తల్లిదండ్రులు అతణ్ని పిలక వుంచుకోమని పట్టుబట్టలేదు. దాన్ని తీసేసేందుకు అతనికే ఎంతమాత్రం ఇష్టంలేదు. ఆ ప్రాంతాలలో ఇంకా పిలకలూ, గుండ్లూ తరచు చూస్తూవుండడంచేత శాస్త్రిని చూచి తక్కిన పిల్లలు అట్టే ఏడిపించేవారు కాదు. ఇప్పుడు కాలేజీలో చేరబోతున్నాడు కనుక పిలక "వుంచడమా, తీసెయ్యడమా" అని రెండురోజులపాటు శాస్త్రి తీవ్రంగా ఆలోచనచేసేడు. చివరికి "కాలేజీకుర్రాళ్లయితేమాత్రం, నా పిలక ఏమైనా వాళ్ల కాళ్లకి అడ్డుపడుతుంది కనుకనా? అదీకాక, పిలక వున్నంతమాత్రంచేత పరీక్షలో మార్కులేమీ తగ్గించెయ్యరుకదా. అందుచేత ఇన్నాళ్లనుంచీ నాతోటే వుంటూవచ్చిన ఈ పిలకని, పాపం, ఇప్పుడెందుకు తీసెయ్యాలి?" అని సమాధానపరచుకొని పిలక వుంచుకొనేందుకే నిర్ణయించుకున్నాడు శాస్త్రి.

* * *

ప్రొద్దున్నే ప్రిన్సిపలుగారిని కలుసుకునేందుకు కాలేజీకి వెళ్లేడు శాస్త్రి. అక్కడ ఎవరూ లేరు.

అంతా నిశ్శబ్దంగా వుంది. "వచ్చేవేళ ఇంకా కాలేదేమో" అనుకొని అక్కడే చతికిలపడ్డాడు. అంతకంతకీ ఎండ ఎక్కువవుతోంది. ఎవరూ రావడంలేదు. దూరాన్నుంచి తొమ్మిదిగంటలు వినబడ్డాయి. ఇంకో అరగంట గడిచింది. ఎవరూ రావడంలేదు. "ఛీ, ఇదేం కాలేజీ! మా హెడ్మాష్టరుగారు పదింటికి వచ్చేవారు, ప్రిన్సిపలుగారు అధమపక్షం తొమ్మిదింటికైనా రావద్దా?" అని విసుక్కుంటూంటే దూరాన్నుంచి ఎవరో వస్తోన్నట్లు అనింది. "ప్రిన్సిపలుగారే కాబోలు, అంత ఠీవిగా వస్తున్నారు" అనుకొని చటుక్కున లేచి నిలుచున్నాడు. "ఇంకా అంత దూరంగా వుండగానే అప్పుడే నుంచోడం ఎందుకు" అనుకొని మళ్లీ కూర్చున్నాడు. "వచ్చీ రాగానే ఈ పిలకాడిదర్పమేమిట్రా అనుకొని ప్రిన్సిపలుగారు అసహ్యపడతారేమో" అని సందేహించి, ఆయన స్తిమితంగా కూర్చున్నాక వద్దామనుకొని లేచి గబగబా పక్కకి వెళ్లేడు. కొంచెం సేపు అటూ ఇటూ తిరిగి మళ్లీ వచ్చి చూసేటప్పటికి తీరాచేసి ప్యూను టేబిలు దులుపుతున్నాడు! "ఇంకా అయ్యవారు రాలేదు కాబోలు" అనుకుని వెనక్కి తిరగబోతూంటే "ఎప్పుడు వచ్చేరండీ అబ్బాయిగారూ? రండి, రండి." అంటూ వినయం వుట్టిపడేలాగ పలకరించేడు ప్యూను. "ఏమిటీ, ఇంతకుముం దెప్పుడూ వీడి ముఖం నే నెరగను, నా ముఖం వీ డెరగడు, ఇంత మర్యాదగా పిలుస్తాడు?" అనుకొని, తెల్లబోతూ—

"ప్రిన్సిపలుగారు ఎప్పుడు వస్తారు?" అని నసిగేడు శాస్త్రి.

"ప్రిన్సిపలుగారాండి? ఇంకా రాలేదండి—ఏదో మీ దయ"—

"ఆ! ప్రిన్సిపలుగారు వచ్చేందుకు నా దయ ఏమిటోయ్?"

"అదికాదండీ అబ్బాయిగారూ — మా మామూలు—"

"ఇంకా కాలేజీలో అడుగేనా పెట్టలేదు, అప్పుడే నీకు మామూలు కావాలా? ఏం న్యాయంగా వుందోయ్?"

"చెబితే నమ్మరు కాని బాబయ్యా, ఇవాళ ఇంకా కాఫీకూడా తాగలేదండి."

"నువ్వు అలా అంటావుకాని, నేనుమాత్రం తాగేనా ఏమిటి?"

"అయితే, ఇద్దరం వెళ్లి తాగివద్దాం, రండి" అంటూ ముందు కొక అడుగు వేసేడు ప్యూను శాస్త్రి లోకువ కనిపెట్టి. "ఇంక ఈ ఘటం ఎలాగా వదిలేలా లేదు, ఎప్పుడో ప్పుడు ఎలాగా పారెయ్యాలికదా" అనుకొని శాస్త్రి ఓ పావలాకాసు తీసి అతని చేతిలో పెట్టేడు. అది పుచ్చుకుని మరి మాట్లాడకుండా గదిలోకి వెళ్లిపోతున్నాడు ప్యూను. "ఏయ్, పావలా పుచ్చుకునికూడా నేను అడిగినదానికి సమాధానం చెప్పవేం?" అని అరిచేడు శాస్త్రి.

"చాల్లెండి, ఇంతోటి పావలా ఎలాగైతేనేం ఇచ్చేరు!"

"ఇంతోటిపావలా కాకపోతే, ఇంతకంటే పెద్ద పావలాలు ఇప్పుడు రావడం లేందే మరి!"

ప్యూనుకు నవ్వొచ్చింది.

"అబ్బో, ప్రిన్సిపలుగారు ఇప్పటప్పుడే ఎలా వస్తారండి? మధ్యాహ్నం కాని రారు." అంటూ టేబిలు సర్దడం మొదలెట్టేడు.

"ఇంతోటి సమాధానానికి ఇంతోటి పావలా సరిపోయింది కాదు కాబోలు ఈయనకి" అని సణుగుకుంటూ వెళ్లిపోయేడు శాస్త్రి.

మధ్యాహ్నం మళ్లీ శాస్త్రి వెళ్లేటప్పటికి ప్రిన్సిపలుగారు గదిలో వున్నారు. శాస్త్రి ఆయనగదిలో ప్రవేశించి చూచేటప్పటికి నలుగురైదుగురు ఆడపిల్లలు ప్రిన్సిపలుగారి టేబిలు కెదురుగా నుంచునివున్నారు. గదినిండా కుర్చీలూ అవీ అమర్చబడివుండడంచేత వాళ్ల ప్రక్కనిమాత్రమే కొంచెం స్థలముంది. "బొత్తిగా వయసొచ్చిన అమ్మాయిలప్రక్కని నుంచోడమేమిటి" అనుకొని శాస్త్రి ప్రిన్సిపలుగారి కుర్చీ ప్రక్కకి వెళ్లి నుంచున్నాడు. "ఏయ్, నీ కేమీ మేనర్సు లేవా, మీద కొచ్చి పడతావు? అక్కడకు పోయి నుంచో." అని గర్జిస్తూ, ఎదురుగా వున్న గోడవైపు చూపించేడు ప్రిన్సి

పలు. శాస్త్రి హడలిపోతూ గబగబా వెళ్ళి, ఆడపిల్లలకు సాధ్యమైనంత దూరంలో వుండాలనుకొని, గోడమూలకు ఒత్తిగిలి నుంచున్నాడు. ఆడపిల్లలందరికీ కాలేజీలో సీట్లు ఇయ్యడమయింది. వాళ్ళంతా, టేబిలుమీద పడేసివున్న ఎవరి కాగితాలు వాళ్ళు తీసుకుంటున్నారు. ఇంతలోనే ప్రిన్సిపలు శాస్త్రిని పిలిచి "నీ సర్టిఫికెట్లూ అవీ తెచ్చేవా? ఏవీ, ఇలా తీసుకురా" అన్నారు. శాస్త్రి ముందుకు వెళ్ళబోయేడు. వెనకాలనుంచి ఎవరో పిలక పట్టుకొని లాగుతూన్నట్లు అనిపించింది. శాస్త్రి ప్రిన్సిపలుగారి గదిలో వున్నానన్న సంగతే మరచిపోయి "ఏయ్, వదులు" అని అరుస్తూ బుర్రనొకమారు టకాయించేడు. గోడనున్న మేకు ఒకటి నేలమీద పడి 'ఖంగు'మని మ్రోగింది. అప్పుడే వెళ్ళిపోతూన్న అమ్మాయీలందరూ ఒక్కసారి ఫక్కున నవ్వేరు. ప్రిన్సిపలు కూడా కొంచెం నవ్వుతూ, "చప్పని తీసుకురా" అన్నారు. శాస్త్రి తీసుకెళ్ళి చూపించేడు. అన్నీ చూచేక "సరే, రేపురా. ఆలోచించి చెబుతాను." అన్నారు ప్రిన్సిపలు. శాస్త్రి "చిత్తం"అని సెలవు తీసుకొన్నాడు. తన గదికి తిరిగి పోతూంటే శాస్త్రికి ఎన్నో అనుమానాలు వచ్చేయి. "ఆడపిల్లలకంటే నే నేవిసంగా తీసిపోయానని వాళ్ళను వెంటనే చేర్చుకొని, తనకు ఆలోచిస్తానన్నారు? — కొంపతీసి, నాకు పిలక వుందని కాదుకదా?—ఏమో—ఇంతకీ ప్రిన్సిపలుగారిది పిలకో కాదో తెలుసుకుందా మనుకుంటే, ఆయన తలపాగా పెట్టుకొని కూర్చున్నారు కదా! దేముడే నాపక్షంలో వుంటే, ఆ తలపాగాలో వున్నది పిలకేఅయితే నాకేం ఫరవాలేదు, తప్పకుండా సీటు వస్తుంది" అనుకున్నాడు శాస్త్రి.

శాస్త్రికి సీటు ఇచ్చేమన్నారు. అతని కింకేమీ అనుమానం లేదు. "ఉత్తినే భయపడ్డాను కాని, ప్రిన్సిపలుగారిది పిలకే అయివుంటుంది" అని నిర్ణయించుకున్నాడు శాస్త్రి.

* * * *

క్లాసులు మొదలెట్టేరు. మొదటి రోజునే శాస్త్రివాలకం చూసి తక్కిన పిల్లలంతా లోపవకట్టేసేరు. శాస్త్రి గదిలోకి అడుగు పెట్టగానే అందరూ తలోమాటా అనడం మొదలెట్టేరు. శాస్త్రి "వీళ్ళతో నేమిటి నాకు? మదగజం పోతూంటే ఎన్నో కుక్కలు మొరుగుతుంటాయి" అని లోలోపలే అనుకుని, వాళ్ళకి ఏ విధమైన సమాధానమూ చెప్పదలచుకోలేదు. మేష్టరు కూర్చునే కుర్చీకి ముందే ఒక బెంచీ ఖాళీగా వదిలివేసివుంది. ఒక్కడూ మేష్టారుదగ్గరే కూర్చుంటే, వీళ్ళెవరూ ఇంకేమీ అనరుకదా అనుకుని శాస్త్రి ఆ బెంచీమీది కెళ్ళి కూర్చున్నాడు. అప్పటిదాకా పెద్దపెట్టున పిల్లలు చేస్తూన్న గోలంతా ఒక్కసారిగా అణిగిపోయింది. ఒకళ్ళతో ఒకళ్ళు సణుగుకుంటూ చిరునవ్వులు మొదలెట్టేరు. శాస్త్రి, అఖండ విజయాన్ని సాధించే ననుకుని, సగర్వంగా కాలిమీద కాలువేసుకుని కూర్చున్నాడు. మేష్టారు వచ్చేరు. ఇంతలో ఆడపిల్లలు వచ్చి శాస్త్రిని చూచి అక్కడే నిలుచుండిపోయేరు. మేష్టారు కోపంతో "నీకు బుద్ధి వుందా లేదా, ఇక్కడ కూర్చున్నావు? వెనక్కిపోయి కూర్చో"అని శాస్త్రిని గదమాయించేరు. పిల్లలంతా (అమ్మాయిలతోసహా) గొల్లుమన్నారు. శాస్త్రికి ఏమీ అర్థమవడం లేదు. "ఇంతగోల చేస్తూంటే, వీళ్ళ నేమీ అనకుండా, మాట్లాడకుండా ఒక్కణ్ణీ కూర్చున్న నామీద కోప్పడతాడేమిటి యీయన?" అనుకుంటూ లేచి నుంచుని పుస్తకాలు తీసుకుంటూంటే ఓ అనుమానం వచ్చింది. వెంటనే మేష్టారు తలవైపు చూచేడు. ఏదో అర్థమయిపోయినట్లు తల కొంచెం వూపుతూ "ఓహో, అదీ సంగతి. మేష్టారుది పిలక కాదు, క్రాపింగు. అందుచేతే—" అని మనసులో అనుకుంటూ వెనకాలకి వెళ్ళడం మొదలెట్టేడు. ఎవరూ చోటు ఇవ్వడంలేదు. ఇంతలోనే ఓ పరిచితమయిన కంఠం తనపేరు మెల్లిగా పిలుస్తూన్నట్లనిపించింది. ఆవైపు చూచేసరికి, వాళ్ళవూరి రాజులఅబ్బాయి అక్కడకు రమ్మని సంజ్ఞచేసేడు. శాస్త్రి వెళ్ళి, కూర్చొని, మెల్లిగా "ఒరే నారాయణరాజూ, నన్ను మేష్టారు కోప్పడుతూంటే మీరంతా ఎందుకురా అలా విరగబడి నవ్వడం? ఇదేనా తోడి విద్యార్థులు చూపించవలసిన మర్యాద? ఇంకెందుకురా మీ చదువులు—"

"నవ్వడం తప్పేకాని, ఒరే, ఆబెంచీ ఆడపిల్లల కని ప్రత్యేకించిందిరా. దానిమీద కెళ్లి నువ్వు కూర్చున్నావు" అన్నాడు రాజు.

"నాకు తెలియక కూర్చున్నా ననుకో. నాతో చిన్నప్పటినుంచీ స్నేహంగా వుంటూన్న నువ్వేనా నన్నక్కడ కూర్చోవద్దని చెప్పొద్దురా ?"

"నేను చెబుదామనే అనుకున్నారా. కాని, వీళ్లంతా 'చెబితే తంతా' మన్నారు. ఏం చెయ్య మన్నావు !"

గంట కొట్టేరు. మేష్టారు వెళ్లిపోయేరు. గదిలో ఓమూలనుంచి ఎవ్వరో "పిలక్"అని కేకేసేరు. శాస్త్రి అప్రయత్నంగా ఆవైపుకు తిరిగి చూచేడు. ఇంతట్లోకే ఇంకోమూలనుండి ఎవరో "పిలకా" అని దీర్ఘంతీసేరు. శాస్త్రి చటుక్కున ఆ వైపుకు తిరిగి చూస్తూంటే వెనకాలనుంచి ఇంకొకరు "పిలకోయ్" అని ఆప్యాయంగా కేకేసేరు. శాస్త్రి ఆవైపుకు తిరగ బోతూంటే ఒక్కసారిగా గదిలో అన్ని మూలలనుంచీ "పిలక" అనేక రూపాలతో మారుమ్రోగిపోతోంది. శాస్త్రికి పట్టరానంతకోపం వచ్చింది. పళ్లు పటపట కొరుకుతూ లేచి నుంచున్నాడు. వాళ్లందరిమీదా పడి ఒక్కసారిగా నలిపి చంపేద్దామా అన్నంత ఉక్రోషం వచ్చి మనిషి నిలువెల్లా కంపించిపోతున్నాడు. ఇంతలో ప్రక్కనున్న రాజు శాస్త్రిచెయ్యి పట్టుకుని కూర్చోబెట్టి—

"కొంచెం శాంతించరా శాస్త్రీ. నువ్వలా ఉడికిపోయేవంటే ఇంకా ఏడిపిస్తారు. నిన్ను కాద న్నట్లు వూరుకోవడం ఉత్తమం" అన్నాడు.

"నీకేంరా చెబుతావు. వీళ్లంతా ఇంత గొడవ చేసేస్తూంటే వింటూ ఎలాగరా వూరుకోవడం ?"

"నామీద కోప్పడతా వెందుకురా మధ్యని ? ఊరుకోకపోతే ఏం చేస్తావేమిటి ?"

"ఏం చేస్తానా ? ఒకళ్లిద్దరిని పట్టుకొని మెత్తగా పచ్చడికింద దంచేస్తా నంతే. దాంతో వీళ్లందరి రోగం చప్పగా వదిలిపోతుంది."

"ఒకరిద్దరివయితే కొట్టగల వనుకో. అంతమందీ కలిసి మీదపడితే ఏం చెయ్యగలవు ?"

"నిజమేరా— ఏడవనీ పశువుల్ని." శాంతిం చేడు శాస్త్రి.

* * *

శాస్త్రికి ఆ గొడవంతా మామూలయిపోయింది. క్లాసులో ఎవరితోటీ మాట్లాడేవాడు కాదు. ఒక్క నారాయణరాజుతో మాత్రం కలిసి తిరుగుతూండేవాడు. కొంతకాల మయేటప్పటికి నారాయణరాజుని "రాజు" గారనీ, శాస్త్రినేమో "దివాను"గారనీ పిలిచేవారు. అలా అంటూంటే శాస్త్రి నిజంగా దివానుఐనంత సంతోషపడేవాడు. ఎటొచ్చీ ఆ "దివాను"తో "పిలక" కూడా సర్వసాధారణంగా కలుపుతూవుండడం శాస్త్రికి ఎంతమాత్రం ఇష్టంలేదు. అతనికి ఇష్టం లేదుకదా అని వాళ్లు మానుతారుకనకనా ? ఆఖరికి ఆడపిల్లలుకూడా తన్ను "పిలకా" అంటూన్నట్లు శాస్త్రికి చాలాసార్లు అనుమానం తగిలింది. కాని శాస్త్రి "వీళ్లతో నేమిటిలే" అనుకొని వాళ్లకేసైనా చూడకుండా పోతూండేవాడు.

శాస్త్రి గబగబా బుర్ర వంచుకొని క్లాసులోకి వెళుతున్నాడు. ఇంకా మేష్టరు రాలేదు. ఆడపిల్లలంతా బైట నుంచున్నారు. శాస్త్రిని చూచి అందులో ఒకరు "పిలకదివానుగారే, తప్పుకో" అంది. అంతా విరగబడి నవ్వడం మొదలెట్టేరు. శాస్త్రి చటుక్కున ఆగిపోయేడు. అతని ముఖం జేవురించింది. శాస్త్రికి "దివాను" అన్నందుకూ, "పిలక" అన్నందుకూ అంత కోపం రాలేదుకాని, యిరవైయేసి ఏళ్లు నెత్తిమీద కొచ్చిన ఆడపిల్లలు సిగ్గూ లజ్జా లేకుండా విరగబడి నవ్వుతూంటే అరికాలిమంట నెత్తికెక్కిపోయింది. శాస్త్రికి ఒళ్లు తెలియడం లేదు. "నేను దివానైనా కాకపోయినా, మీరుమాత్రం అచ్చంగా దివాణంలో దాసీ వాళ్లలాగ వున్నారు" అన్నాడు శాస్త్రి గంభీరంగా.

"ఛీ, నోరుముయ్. ఉత్తి అడివిమృగంలా వున్నావే!" అంది ఒకత్తి.

"నాకేం నోరు మూసుకొనేదాకాను ? దివాను గారి ఆజ్ఞ. మీరే నోరుమూసుకోండి" అన్నాడు.

"ఏడిసేవులే, సంతోషించేం" అంది ఒకర్తి.

"చెప్పుదెబ్బలు తగులుతాయి" అంది యింకొకర్తి.

"తగులుతే మళ్లీ తగులుతాయి, పిలకుందికదా అని ఉత్తి చేతకాని దద్దమ్మననుకుంటున్నారేమో." అని హుంకరించేడు శాస్త్రి.

"తగుల్తాయూ? చూద్దాం"—అని చెప్పు విసిరింది ఒకర్తి.

అది శాస్త్రిచేతిని రాసుకుంటూ పోయింది. ఆ విసరినదాని పీక అమాంతంగా నొక్కయ్యాలనుకొని శాస్త్రి, ఒక్క అడుగు ముందుకు వేసేడు. ఇంతట్లోకి ఏం తోచిందో, ఆగిపోయి, వెనక్కి తిరిగివచ్చి, ఆ చెప్పు తీసి చేత్తో పట్టుకొని, "ఆడవాళ్లు అయిపోయేరుకాని, ఇవాళ యీ కాలేజీ అంతా కలిసి వచ్చినా నా శక్తి చూచివుండేవారు" అంటూ శక్తికొలదీ ఆ చెప్పును దూరంగా విసిరేసేడు. కొంతమంది కుర్రాళ్లు ఆ గొడవంతా నిశ్శబ్దంగా చూస్తున్నారు. తరువాత వాళ్లలో వాళ్లు ఏదో రహస్యంగా మాట్లాడుకుంటున్నారు. ఇంతలోకే మేష్టారు వచ్చేరు. అందరూ లోపలి కెళ్లి కూర్చున్నారు.

కాలేజీ వదిలిపెట్టేరు. కుర్రాళ్లంతా "చుంచు", "చుంచు" అని కేకలేస్తున్నారు. "దివాను," "పిలక" వదిలేసి "చుంచు" అని క్రొత్తపేరు పెట్టి నన్ను ఏడిపించదలచుకున్నారు లావుంది వీళ్లంతా" అనుకుంటున్నాడు శాస్త్రి. ఇంతట్లోకే నారాయణ రాజుకూడా 'చుంచు' అని గట్టిగా అరవడం చూచి శాస్త్రి నిర్ఘాంతపోయేడు. ఇంతవరకూ రాజు ఒక్కడే అతన్ని ఏడిపించకుండా వున్నవాడని శాస్త్రి అనుకుంటున్నాడు. రోజూ రాజుతో కలిసి గదికి పోతూవుండేవాడు. ఇవాళ రాజును కలుసుకోకుండానే, ముఖం ముణుచుకొని, గబగబా వెళ్లిపోతున్నాడు. వెనకాలనుంచి రాజు వచ్చి, శాస్త్రి భుజం మీద చేయివేసి—

"ఏరా, మాట్లాడకుండానే వెళ్లిపోతున్నావు" అన్నాడు.

భుజంమీద వేసిన చేయ్యి తోసేసి "వెళుమా" అన్నాడు శాస్త్రి.

"అంత కోపంగా వున్నావేరా, ఇవాళ?" అన్నాడు రాజు.

"అబ్బ, నన్నిలా పోనిద్దూ, నీకు పుణ్యం వుంటుంది!"

"ఇవాళ ఏదో వుంది విశేషం. నాతో చెప్పకూడదేమిట్రా శాస్త్రీ?"

"చాల్లేరా, ఏమీ తెలియనట్లు మాట్లాడుతావు!"

"నాకు నిజంగా తెలియదురా బాబూ. చెప్పుదూ."

"చెప్పేందుకేముంది? నువ్వూ వాళ్లలోనే చేరేవు కాదుటోయ్?"

"రామ, రామ! వాళ్లందరితోటీ చేరడమేమిటి?"

"ఆ, ఆ! చూడకపోతే మరీ చెబుదువు. వాళ్లతో చేరి 'చుంచు' అని పిలవడం లేదురా? ఎందుకురా యీ మాత్రందానికి అబద్ధమాడడం?"

"'చుంచు' అంటే నీకేంరా మధ్యని?"

"నీకు అలాగే వుంటుందిరా మరి—కాదుకాని, నువ్వుకూడా నన్ను ఏడిపించడం నీకు బాగుందా చెప్పు."

"నిన్ను ఏడిపించడం లేదురా బాబూ. నిన్ను యిందాకా కొట్టిన అమ్మాయినిరా 'చుంచూ' అంటోంట. ఇందాకా ఆ అమ్మాయిపొగరుమోత్తనం చూచి, అందరూ దాన్ని ఏడిపించాలని నిర్ణయించుకున్నారు."

"నేను నమ్మనురా—"

"కావలిస్తే ఆ అమ్మాయిమూతి ఓసారి చూడరా బాబూ, నీకే అర్థమయిపోతుంది."

"ఆ అమ్మాయినయితేమాత్రం, అలా పేర్లు పెట్టి ఏడిపించడం నాకేమీ ఇష్టంలేదురా."

"ఏడిసేవులే! నీ యిష్టమెవరికి కావాలి?"

"అదికాదురా—" అని యింకా ఏదో చెప్పబోతూంటే ఓ ప్యూను వచ్చి "రామశాస్త్రిగారు మీ

లేనా" అని అడిగేడు. శాస్త్రి 'ఔనన్నాడు. "మిమ్మల్ని ప్రిన్సిపలుగారు ఓమారు రమ్మంటున్నారు" అన్నాడు ప్యూను. శాస్త్రి వెళ్లేడు.

"నువ్వు ఆడపిల్లలను చాలా అవమానపరిచేవని వాళ్లంతా రిపోర్టుచేసేరు. నిజమేనా?" అని అడుగుతూ, శాస్త్రి సమాధానం చెప్పకుండానే, అమ్మాయిాల విషయం కలగజేసుకున్నందుకు తలవాచేటట్లు తిట్టడం ప్రారంభించేరు ప్రిన్సిపలుగారు. శాస్త్రి అందులో తన తప్పేమీ లేదని చెప్పదామనుకున్నాడు. కాని ప్రిన్సిపలుగారు అతన్ని నోరు ఎత్తనియ్యలేదు. ప్రిన్సిపలుగారు నోరు నొప్పిపెట్టేదాకా తిట్టి, చివరని "నీకు అయిదురూపాయిాలు జరిమానా వేసి యీ మాటుకు క్షమించేను. ఇంకెప్పుడైనా నువ్విలా ప్రవర్తించేవని తెలిస్తే నీచదువుకే నీరువగులుకోవలసి వస్తుంది. జాగ్రత, పో." అన్నాడు. శాస్త్రి యింతసేపూ తలవంచుకొని నిలుచున్నాడు. అతని కండ్లవెంట నీళ్లు తిరిగేయి. ఆఖరికి ధైర్యం తెచ్చుకొని "అన్యాయం" అని అరచి, తలఎత్తి చూచేడు. ప్రిన్సిపలు అక్కడ లేడు. "ఇంక యిక్కడ నుంచోడమెందుకు? గదికి వెళ్లి గట్టిగా ఏడవచ్చు" ననుకొని మెల్లిగా బయలుదేరేడు. ఈమారు "ప్రిన్సిపలుగారి తలపాగాక్రింద వున్నది పిలక కాదు, క్రాపింగే అయి వుంటుంది" అని నిర్ణయించుకొన్నాడు, గదిగుమ్మం ఎక్కుతూ.

శాస్త్రికి యిలాంటి గొడవలూ, ఆలోచనలతోటే కాలమంతా గడిచిపోతూవుండేది. కాలేజీకి వెళ్లడం, గదికి రావడం తప్ప యింకేమీ పరికించేవాడు కాదు. ఎవరిజోలికి గాని పోయేవాడూ కాదు. అలాగే మొదటిసంవత్సరం గడిచిపోయింది.

*   *   *   *

మళ్లీ కాలేజీలు తెరిచేరు. శాస్త్రిని ఎవళ్లూ అంతగా ఏడిపించడం మానేసేరు. ఎవరేనా ఓమాట అన్నప్పటికీ, శాస్త్రి మళ్లీ తమాషాగా ఏదో అనడం, అందరూ కలిసి నవ్వుకోడంతోటే పోతూవుండేది. శాస్త్రి యీమారు కాస్తబుర్రఎత్తి, కళ్లు విప్పి నాలుగు విషయాలూ పరికించడం మొదలెట్టేడు. ఇదివరకటిదాకా కాలేజి విద్యార్థులలో ఒక్కరికికూడ చదువుమీద యీషణ్మాత్రమైనా శ్రద్ధలేదనుకొనేవాడు శాస్త్రి. కాని యిప్పుడు కుర్రాళ్లంతా ముందు బెంచీలకోసం దెబ్బలాడుకోవడం చూచేడు. "నాది పొరబాటేరా, రాజూ. వీళ్లంతా మేష్టారుదగ్గరగా కూర్చుని పాఠం వినాలని ఎలా పోట్లాడుకుంటున్నారో చూడు." అన్నాడు ఓరోజున శాస్త్రి పక్కనున్న రాజుతో.

"అదంతా పాఠాలమీద శ్రద్ధ కాదురా బాబూ. అమ్మాయిాలకు సాధ్యమైనంత దగ్గరలో కూర్చోవాలని వాళ్ల ఉబలాటం."

"అంతే నంటావా?"

"నువ్వెక్కడ మనిషివిరా బాబూ!"

"అయితే, వాళ్లదగ్గరగా కూర్చున్నంతమాత్రంలో వాళ్లకు కలిగే లాభమేమిటో?"

"ఏమిటో, ఏంచెబితేమాత్రం నీకు అర్థమవుతుందిరా—ఏం, నీకుకూడా అక్కడ కూర్చోవాలని వుందా ఏమిటి?"

"ఛా, ఛా! అందుకు కాదురా-"

"అవా, మొహమాటం పడకు."

"కాదుకాని, ఒరే, ఇందాకా ఆ అమ్మాయితో ఏమిట్రా మాట్లాడుతున్నావు?"

"ఏంలేదురా. ఆ అమ్మాయి'నోట్సు' ఓమారు అడిగేను."

"పోరా, నీ దబాయింపులకు లొంగిపోతాననుకున్నావు. ఒరే, ఇంతకాలంనుంచీ మన ఇద్దరం స్నేహితులంకదా, 'నోట్సు' నన్ను అడగక ఆ అమ్మాయినే ఎందుకు అడగవలసివచ్చిందిరా? ఎవరైనా నమ్ముతారంటావా నీ మాట?"

"నువ్వు నాకు ఎలాగ స్నేహితుడవో, ఆమె కూడా అలాగే స్నేహితురాలు కాకూడదుట్రా?"

"ఓవ్, ఇంక కట్టిపెట్టవోయ్ నీ వేదాంతాలు. నాలాగే ఆమెకూడా స్నేహితురాలయితే, ఆ రెప్పవాల్చకుండా చూడడా లెందుకు? వెనుకవెనుక తిరగడా లెందుకు? ఎందుకో తెలియకుండా, ఆమె

నవ్వింది కదా అని నవ్వడా లెందుకు ? నాకేసి ఎప్పుడైనా అలా చూసేవా ? పోనీ, నాకు పిలకుంది కదా అని చూడలే దనుకో. ఇంకే మగపుర్రాడికే పైనా అలా చూస్తావా?—ఎందుకురా అబద్ధాలాడుకోడం?"

"అదంతా నీలాటివాళ్లకి అర్థమవదు లేరా."

"అర్థమవకేం, చచ్చినంత అర్థమయింది. నువ్వు దానికి ఒప్పుకో వంతే."

"అలా అనుకునే పట్టీలుకొట్టడం. నీ ఇష్టం వచ్చినట్లు అనుకో."

ఆ వేళకి ఆప్రసంగం ఇంకేమీ రాలేదు. ఏమైనా, ఆడపిల్లలూ మగపిల్లలూ కలిసి అంత విచ్చలవిడిగా తిరగడం శాస్త్రికేమీ నచ్చలేదు. ప్రతివాడూ ఏదో వంక కల్పించుకుని చీటికీమాటికీ ఆడపిల్లలదగ్గరకు పరిగెత్తుతూండడం, వీళ్లు ఎప్పుడు వస్తారా అని వాళ్లూ ఎదురు చూస్తూండడం చూస్తూంటే శాస్త్రికి మతిపోయేది.

వాళ్ల క్లాసులోనే 'శోభావతి' అనే అమ్మాయి వుంది. నవీనత్వమంతా ఆమెలో కనబడుతూ వుంటుంది. ఆమెపోకులు, వేషాలు, విలాసాలూ ఆ కాలేజీలో వున్నవాళ్లందరినీ (కొందరు మేష్టార్లతోసహా) ఆకర్షించేవి. శాస్త్రికూడా ఆమెలో ప్రత్యేకత గుర్తించకుండా వుండలేకపోయేడు.

శాస్త్రిగదికి పోయే దారిలోనే వుంది ఆమె వుండే యిల్లు. ఆవైపు వెళ్లినప్పుడల్లా శాస్త్రికళ్లు అప్రయత్నంగా ఆమెగదిమీద పడుతూండేవి. ఎప్పుడు చూచినా నలుగురైదుగురు మగవాళ్లతో కలిసి నవ్వుతూ కులాసాగా కబుర్లు చెబుతూనేకాని, ఒంటరిగా ఎన్నడూ కనిపించలేదు. అక్కడికి రాకుండా, ఆమె 'టీ' తాగకుండా వున్న కుర్రాడు ఒక్కడూ కనిపించ లేదు శాస్త్రికి. 'ఆమెతత్త్వం ఏమైవుంటుందా' అని శాస్త్రి అహోరాత్రాలూ ఆలోచించేవాడు. ఒకొక్కప్పుడు అదంతా ప్రేమ అనుకొనేవాడు. వెంటనే "ఇంతమందినీ ఒక్కసారిగా ఎలా ప్రేమిస్తుంది ఈవిడ ?" అనుకొనేవాడు. ఏమీ అర్థంకావడంలేదు. ఓ రోజురాత్రి ప్రక్కమీద పడుక్కొని "ఎలాగైనా శోభతో (శోభావతిని అందరూ 'శోభ' అనేవారు) పరిచయం కలిగించుకొని, ఆమె ప్రవర్తన జాగ్రతగా పరిశీలించి, ఆమె బలహీనత్వానికి తగిన బుద్ధి చెప్పాలి" అని అనుకుంటూ, తల నిమురుకుంటూంటే చేతికి పిలక తగిలింది. శాస్త్రి కొంచెం నవ్వుకొని "అంతకంతకీ ఇంత తెలివితక్కువవాడనై పోతున్నానేం ? ఎందుకీ అసంభవమైన ఆలోచనలు ! ఈ పిలక వున్నంతకాలం మొగపిల్లలే నాతో సరిగా మాట్లాడకుండావుంటూంటే, ఆడపిల్లలు నాతో మాట్లాడుతారా ? అందులోనూ శోభా ? అక్క!— అయినా కాని, ఆవిడ ఎలా పోతే నాకెందుకు ? రాత్రింబగలూ దాన్నిగురించే ఆలోచిస్తూ ఎందుకిలా బుర్రంతా పాడుచేసుకోవడం ? ఈ పాడుగొడవతోటి చదువూ సంధ్యా ఎగిరిపోయేయికదా—రేపటినుంచి ఏమైనా సరే, శోభ పేరైనా తలపెట్టకూడదు. అసలు ఆ వైపు చూడనేకూడదు—" అనుకుంటూండగానే నిద్రపట్టి పోయింది.

మర్నాడు శాస్త్రి కాలేజీకి పోతూంటే, వద్దనుకుంటూన్నా ఆతని కళ్లు శోభగదిమీద పడ్డాయి. శోభ గబగబా బయటికి వచ్చి "శాస్త్రిగారూ" అని పిలిచింది. శాస్త్రి, ఇంకెవరినో అనుకొని, వెళ్లిపోతున్నాడు. "మిమ్మల్నేనండీ శాస్త్రిగారూ" అని శోభ మళ్లీ పిలిచింది. శాస్త్రి అనుమానిస్తూనే దగ్గరికి వెళ్లేడు. "మీరేమీ అనుకోకుండా, ఈ సెలవుచీటీ కాస్త పట్టికెళ్లి ఇస్తారా." అంటూ చీటీ అందియ్యబోయింది శోభ. శాస్త్రి కంగారుతో "అబ్బెబ్బే, ఏమీ అనుకోను" అంటూ చేతిలో వున్న పుస్తకాలు చంకలో పెట్టుకొని దోసిలి పట్టేడు. శోభ నవ్వునాపుకొని చీటీ అందులో పడేసి 'థాంక్స్' అంది. శాస్త్రి ఆ కంగారులో 'ఉ' మాత్రం అనేసి బయలుదేరేడు. వెళుతూ వెళుతూ పిలక వుందో లేదో ఓసారి చూచుకున్నాడు.

శోభది విచిత్రమైన స్వభావం. నిజానికి ఆమెలో దురుద్దేశాలేమీ లేవు. తక్కిన వాళ్లకన్న విశిష్టంగా వుండాలని ఆమెకోరిక. అందరూ తనతో మాట్లాడాలనీ, అందరూ తనను మెచ్చుకోవాలనీ, అందరినీ తన చేతిలో వుంచుకోవాలనీ ఆమె ఆశిస్తూవుండేది. డాబైన అలంకరణాలతోటీ, తీయని కబుర్లతోటీ,

తరల తారకాలతోటే, చిరునవ్వులతోటే అందరినీ ఆకర్షించేది. ఎవరినీ ప్రత్యేకించి ఆహ్వానించేది కాదు. కాని, వచ్చినవాళ్లందరితోటే కులాసాగా కాస్సేపు కబుర్లు చెప్పి, టీ ఇచ్చి పంపించేది. అదే ఆమెకు ఆనందం. ఎంతెంతటివాళ్లయినా వచ్చేవారు. శాస్త్రిమాత్రం ఎన్నడూ మాట్లాడలేదు. "శాస్త్రిమాత్రం ఎందుకు రాకూడదు ? ఎందుకు నాతో మాట్లాడకూడదు ?" అని శోభ అప్పుడప్పుడు బాధపడుతూవుండేది. "ఒక్కసారైనా శాస్త్రి రాకుండాపోతాడా, చూస్తాను." అని గడచిన సంవత్సరమంతా చూచింది. ఈ సంవత్సరం కూడా జరిగిపోతోంది. శాస్త్రి రావడం లేదు. శోభ ఇంక ఉండబట్టలేకపోయింది. "ఆతడు వచ్చి నాతో మాట్లాడకపోయినా, రేపు నేనే పలకరించి చూస్తాను" అని నిర్ణయించుకుంది శోభ. ఆనాడు శాస్త్రిని పిలిచి టీకి ఇయ్యడానికి కారణం అదే.

శాస్త్రి కాలేజీనుంచి గదికి పోతూంటే మళ్లీ పిలిచింది శోభ. శాస్త్రి కొంచెం సిగ్గుపడుతూ గదిలోకి వెళ్లి కూర్చున్నాడు. శోభ స్వయంగా టీకలిపి శాస్త్రిముందు పెట్టి 'పుచ్చుకోండి' అంది. "అబ్బే, నే నెప్పుడూ ఇలాంటివి త్రాగనండి" అన్నాడు శాస్త్రి. "ఇవాళటికే కాదూ, కొంచెమే పుచ్చుకోండి" అంది శోభ. "నాకు ఇష్టం లేదంటూంటే చావనా ఏమిటి?" అన్నాడు శాస్త్రి కొంచెం విసుగ్గా.

"నేను ఇస్తోన్నా కాని త్రాగరా ? పోనీలెండి–" అని జాలిగా చూచింది శోభ. శాస్త్రి రెండుగ్రుక్కల్లో గ్లాసు ఖాళీచేసేడు.

శాస్త్రి తన గదికి పోయి కూర్చున్నాక, శాంతంగా, ఆనాడు జరిగిన సంఘటన ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. శోభ ఏం చెప్పినా అందరూ ఎందుకు చేస్తూంటారో శాస్త్రికి ఇప్పుడే కొంచెం కొంచెం అర్థమవుతోంది. గతరాత్రి అతనికి కలిగిన ఆలోచనలన్నీ మళ్లీ పాటకరించేయి. ఇంక శోభకి తగిన బుద్ధిచెప్పడం అసాధ్యం కాదనుకున్నాడు.

నాటినుండి శాస్త్రి తరచు శోభగదికి వస్తూ పోతూ వుండేవాడు. శోభ, అందరిలాగే శాస్త్రిని కూడా మర్యాదగా చూసేది. ఎప్పుడైనా తక్కినవాళ్లు శాస్త్రిని చులకనచేయబోతే, శోభ వాళ్లని వారించేది. ఎంత జాగ్రతగా పరికించినా, శోభ ఆంతరంగికప్రవృత్తి ఏమిటో శాస్త్రికి అగాధంగానే వుంటూవచ్చింది. "ఎప్పుడు సమయం దొరుకుతుందా, ఎప్పుడు శోభకి బుద్ధిచెప్పడం కలుగుతుందా" అని అనుక్షణం శాస్త్రి తహతహలాడిపోయేవాడు.

శాస్త్రి ఆత్రుతపడినకొద్దీ సమయం దొరకడం లేదు. సర్వసాధారణంగా శోభతో ఎవరో ఇద్దరుముగ్గురైనా వుంటూవుండేవారు. అదృష్టవశాత్తూ ఎప్పుడైనా ఒంటరిగా తటస్థపడితే శాస్త్రి సిగ్గుపడి అడగడమైనా మానేసేవాడు. లేదా, కొంచెంసేపు గడిచేక, నిద్రవస్తోందనో, భోజనానికి వెళ్లాలనో చెప్పి శోభ వెళ్లిపోయేది. తరువాత శాస్త్రి వేలు కొరుక్కునేవాడు.

పెద్దపరీక్షలు దగ్గరకువచ్చేస్తున్నాయని శాస్త్రికేమీ తెలియడం లేదు. ఒక్కసారైనా పుస్తకం తిరగవేయడం లేదే అన్న విచారమే లేదాతనికి. ఆతనిని బాధిస్తున్నదల్లా ఒక్కటే—శోభ. "పరీక్షలైపోతే ఆమె ఎక్కడో, నేను ఎక్కడో ? ఈలోపునే ఆమెకు బుద్ధిచెప్పడం పడదా ?" అనుకొని రెట్టించిన దీక్షతో సమయంకోసం ఎదురుచూస్తున్నాడు. కాలం మాత్రం అతన్ని లక్ష్యంచేయకుండా గడిచిపోతోంది.

పరీక్షలు జరుగుతూన్న వారంరోజులూ శాస్త్రి శోభను కలుసుకోవడం పడనేలేదు. ఆఖరుపరీక్ష వ్రాసేసి శాస్త్రి వచ్చేస్తూంటే శోభ వీథిలో నుంచుంది. గదిలో ఎవరో క్రొత్తవ్యక్తి కూర్చున్నట్లు కనిపించింది శాస్త్రికి. శాస్త్రిని ఆపి "రేపు నేను తొమ్మిదిగంటల బండిలో వెళ్లిపోతున్నాను. దిగబెట్టేందుకు రైలుదగ్గరకు వస్తారుకాదూ ?" అంది శోభ. "రేపేనా మీరు వెళ్లడం ?" అని అడిగేడు శాస్త్రి క్రుంగిపోతూ. "అవును. తప్పకుండా స్టేషనుకు వస్తారుకాదూ." అంది శోభ. వస్తానని గదికి వెళ్లిపోయేడు శాస్త్రి.

శాస్త్రి స్టేషనుకు వెళ్లేటప్పటికి రైలు కదలడానికి ఇంక అట్టేటైము లేదు. శోభచుట్టూ చాలామంది మిత్రులున్నారు. శాస్త్రి వస్తూండగానే "హల్లో,

వచ్చేరా. రారేమో అనుకున్నాను. చాలా సంతోషం." అని గ్రుక్కతిప్పుకుండా అనేసి, ఆ ప్రక్కనే నుంచుని వున్న యువకుని చూపిస్తూ "వీరు మా ఆయన" అంది. శాస్త్రికి అర్థంకాక 'ఆ?' అన్నాడు. "అంటే, నా భర్తగా రన్నమాట. ఇంగ్లండులో చదువు పూర్తిచేసి మొన్ననే వచ్చేరు.—వీరే శాస్త్రిగారంటే—" అని భర్తకి శాస్త్రిని చూపించింది.

"శాస్త్రిగారా?" అని అడిగేడు ఆయన.

"ఆ, పిలకశాస్త్రిగా రని మీకు అప్పుడప్పుడు వ్రాసేదాన్ని, జ్ఞాపకంలేదూ?" అంది శోభ.

"ఓహో, ఆ శాస్త్రిగారేనా వీరు—చాలా సంతోషం మీ దర్శనంవల్ల" అంటూ శాస్త్రిచేయి పట్టుకున్నాడు. శాస్త్రికి ముచ్చెమటలూ పోసేసేయి. "కొంపతీసి, ఆమెపట్ల నా ప్రవర్తన బాగా లేదని వ్రాయలేదుకదా శోభ? ఇంతమందిలోనూ మొగుడిచేత కొట్టించి అవమానపరిచేందుకేమో రైలుదగ్గరకు రమ్మని మరీమరీ చెప్పింది?" అనుకొని వణికిపోతున్నాడు "నేనేమీ తప్పు చెయ్యలేదనీ, చెడ్డఉద్దేశమైనా లేదనీ ఆయనతో చెప్పాలని చాలా ప్రయత్నం చేసేడు. కాని మాటరాలేదు. ఇంతలోనే రైలు కూసింది. శోభ అందరిదగ్గరా సెలవు తీసుకొని రైలు ఎక్కింది. "పిలకశాస్త్రిగారూ, నమస్కారం, సెలవు" అన్నాడు ప్రత్యేకంగా శోభభర్త. శాస్త్రిబుర్ర తిరిగిపోతోంది. ఎలాగైతేనేం, ధైర్యం తెచ్చుకుని "నా పేరు పిలకశాస్త్రి కాదు, రామశాస్త్రి" అని చెప్పుదామని చూసేసరికి రైలులేదు. గదికి వెళ్లి, పిలకమీద చేయి వేసుకొని, గంటలతరబడి నవ్వుకున్నాడు.

పెట్టి ఓ కూలివాడి నెత్తిని పెట్టి, కాలేజీ ప్రక్కనుంచి కార్లు 'స్టేండు'కు వెళుతున్నాడు శాస్త్రి. ఇదివరకటి ప్యూను గబగబా ఎదురుపడి "నమస్కారమండీ అబ్బాయిగారూ" అన్నాడు. శాస్త్రి తప్పించుకుని వెళ్లిపోతున్నాడు. ప్యూను వెంటపడి "ఏదో బాబయ్యా, మీదయ—కాఫీకి—" అన్నాడు. శాస్త్రి వెనక్కి తిరగకుండానే ఆ, అ, ఇంక ఈకాలేజీ ముఖం చూడదలచుకుంటేకాదూ నీ కేమైనా ఇయ్యడం" అంటూ నడకవేగం హెచ్చించేడు. ప్యూను నిలబడిపోయి చుట్ట వెలిగించుకుంటూ "ఈయన వాటం చూస్తే పాసయేలా కనబడటంలేదు" అనుకున్నాడు.

